క్లుప్తంగా

ఘనంగా అన్నమాచార్య వర్ధంతి


సమావేశంలో మాట్లాడుతున్న సత్యకృష్ణ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో తాళ్లపాక అన్నమాచార్యుల 522వ వర్ధంతి సందర్భంగా అన్నమాచార్య రచించిన సామాజిక గీతాలాపన నిర్వహించారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో విశ్వహిందూ పరిషత్ పశ్చిమ గోదావరి జిల్లా నల్ల సత్యకృష్ణ కిరణ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అన్నమాచార్యుల సామాజిక సమరత గురించి వివరించారు. కార్యక్రమంలో ధర్మపరిరక్షణ పట్టణ అధ్యక్షుడు గాదె వెంకన్న, వక్తలు సదాశివరావు, కన్యాకుమారి, ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాస్, విశ్వహిందూ పరిషత్ సభ్యురాలు సునీత తదితరులు పాల్గొన్నారు.

హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్‌పో విజయవంతం


సమావేశంలో మాట్లాడుతున్న కలవకొలను తులసిరావు

నరసాపురం రూరల్: అంతర్జాతీయ లేసు ట్రేడ్ సెంటర్ (ఐఎల్‌టీసీ) వేదికగా ఐదు రోజులపాటు జరిగిన హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్‌పో విజయవంతంగా జరిగిందని, అందుకు కారకులైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఈపీసీహెచ్ సదరన్ రీజియన్ కోఆర్డినేటర్ కలవకొలను తులసిరావు అన్నారు.రుస్తుంబాద గ్రామంలోని ఐఎల్‌టీసీ భవనంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హస్తకళల ఎగుమతి ప్రోత్సాహక సంస్థ (ఈపీసీహెచ్) ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 25 వరకూ హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్‌పో పేరుతో నరసాపురంలో ఈ ఎక్స్‌పో నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ ఎక్స్‌పోలో 70కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేసి వారి వస్తు ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు నిర్వహించిన వారంతా సంతృప్తి వ్యక్తం చేశారని తులసిరావు పేర్కొన్నారు. ఐదు రోజులపాటు జరిగిన ఈ ఎక్స్‌పోను సుమారు 20 వేలమందికి పైగా సందర్శించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈపీసీహెచ్ డిప్యూటీ డైరెక్టర్ రాజేష్ సింగ్, లేసుఎక్స్‌పోర్టర్లు అడ్డగళ్ల బాబు, పులపర్తి ప్రతాప్, కావలి నాని పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి


గుత్తుల సాల్మన్ దొర

పెనుగొండ: పాస్టర్ ప్రగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేయాలని క్రైస్తవ సంక్షేమ సంఘ నాయకులు గుత్తుల సాల్మన్ దొర ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయన మృతిపై క్రైస్తవులకు, అభిమానులకు ప్రజల్లో అనేక అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిష్పక్షపాతంగా విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.

హోటళ్లపై దాడులు

ఆకివీడు: మండలంలోనూ, పట్టణ పరిధిలో వివిధ హోటళ్లపై బుధవారం సివిల్ సప్లయిస్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో వ్యాణిజ్య సిలెండర్లు వినియోగించకుండా, గృహావసర గ్యాస్ సిలెండర్ల వినియోగిస్తున్నట్లు గుర్తించి మొత్తం 18 సబ్సిడీ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నాలుగు హోటళ్లపై సెక్షన్-6ఏ కేసు నమోదు చేయనున్నట్లు సివిల్ సప్లయిస్ డీటీ మహేష్ చెప్పారు.

నలుగురి బైండోవర్

వీరవాసరం: ఎక్సైజ్ కేసుల్లో సంబంధం ఉన్న వీరవాసరం మండలానికి చెందిన నలుగురు వ్యక్తులను వీరవాసం తహసీల్దార్ కోర్టులో బైండోవర్ చేశామని ఎక్సైజ్ సీఐ ఎం.బలరామరాజు బుధవారం తెలిపారు. వీరవాసరానికి చెందిన మట్టా వెంకటేశ్వరరావు, పెర్కిపాలెంకు చెందిన గెద్దం రాంబాబు, తోట రమేష్, అండలూరుకు చెందిన మల్లుల ప్రసాద్‌లను బైండోవర్ చేసి, ఒక్కొక్కరి దగ్గర నుంచి లక్ష రూపాయలు పూచికత్తు తీసుకున్నామన్నారు.

ఆక్యుపంక్చర్ వైద్యుడికి డాక్టరేట్


అవార్డు అందుకుంటున్న నర్సింహరాజు

నరసాపురం: పట్టణానినికి చెందిన ప్రముఖ ఫిజియోథెరపిస్ట్, ఆక్యుపంక్చర్ వైద్యుడు తిరుమాని నర్సింహరాజు వైద్యరంగంలో చేసిన ససేవలకు గాను డాక్టరేట్ అందుకున్నారు. పాండిచ్చేరి ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ నుంచి ఆయన ఈ అవార్డు తీసుకున్నారు. యూనివర్సిటీ స్నాతకోత్సవం సందర్భంగా పాండిచ్చేరిలో జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్ అందించినట్లు డాక్టర్ నర్సింహరాజు చెప్పారు.

కౌన్సిల్ సమావేశంలో కులాల ప్రస్తావన ఎందుకు?

జనసేన సభ్యుడిపై చైర్‌పర్సన్ ఆగ్రహం

నరసాపురం: కౌన్సిల్ సమావేశంలో కుల ప్రస్తావన తీసుకురావడం ఎందుకు? అని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ జనసేన సభ్యుడు సురేష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ శ్రీవెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. అయితే సమావేశం ప్రారంభం కాగానే 22వవార్డు జనసేన సభ్యుడు సురేష్ చైర్‌పర్సన్ ఎదురుగా నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. గత సమావేశంలో తాను అడిగిన ప్రశ్నలకు లిఖిత పూర్వకంగా అధికారులు సమాధానం ఇవ్వలేదని, మిగిలిన కొందరు కౌన్సిలర్లుకు సమాధానం ఇచ్చారని అన్నారు. తాను ఎస్టీని కాబట్టి వివక్ష చూపిస్తున్నారని సురేష్ ఆరోపించడంపై చైర్‌పర్సన్ అభ్యంతరం చెప్పారు. మీకు సంబంధించిన అంశాల్లో అధికారుల నుంచి వివరణ పొందాలి. ఏదైనా ఇబ్బందులంటే నా దృష్టికి తీసుకురావాలి. అంతేగానీ అనవసరంగా ఇక్కడ కులాల ప్రస్తావన ఎందుకు? అని పేర్కొన్నారు. సభలో అన్ని సామాజిక తరగతుల వారు ఉన్నారని, ఎవరి గౌరవానికి భంగం కలిగినా సహించమని స్పష్టం చేశారు. అయితే


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ

అధికారులు పొంతనలేని సమాధాలు చెప్పడం, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం వల్లే ఇబ్బందులు వస్తున్నాయని మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు వైకేఎస్ అన్నారు.

సిల్ట్‌తీత పనులకు అంత సొమ్ము ఎందుకు..?

డ్రెయిన్స్‌లో సిల్ట్‌తీత పనులకు రూ.49 లక్షలు కేటాయించడంపై వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని అభ్యంతరం చెప్పారు. గడిచిన పదేళ్లలో పట్టణంలో డ్రెయిన్స్ విస్తీర్ణం పెరగలేదని, కానీ ఏటా సిల్ట్‌తీత పనులకు లక్షలు, లక్షలు వ్యయం పెంచేస్తున్నారని


సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న కౌన్సిలర్లు

అన్నారు. గత మూడేళ్లలో సిల్ట్‌తీత పనులకు ఎంతెంత కేటాయించారో? చెప్పాలని మరో వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని అధికారులను నిలదీశారు. పట్టణంలో వేసవిలో మంచినీటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఐదో సభ్యుడు వన్నెంరెడ్డి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులు లేకుండా సమావేశం ఎందుకు?

పట్టణంలో ఒక్క అభివృద్ధి పని కూడా పెట్టకుండా అజెండా రూపొందించి సమావేశం పెట్టడం ఎందుకు? అని సభ్యులు సిర్రా కాంతమ్మ, వంగా శ్రీకాంత్‌కన్నా, కోటిపల్లి సురేష్, కావలి రామసీత, ద్వారా గంగాభవానీ ప్రశ్నించారు. 15వ ఆర్థికసంఘం నిధులు ఉండ కూడా అభివృద్ధి పనులు ఎందుకు చేయడంలేదని ప్రశ్నించారు. ప్రతి సమావేశంలో తనకు సమస్యలపై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడంలేదని ఒకటో వార్డు కౌన్సిరల్ సోమవరాజు దుర్గాభవానీ మండిపడ్డారు. సమావేశంలో కౌన్సిలర్లు మల్లాడి వేషవేణి, పడివాడ పద్మ, సఖినేటిపల్లి సురేష్, కేసరి గంగరాజు, పాలూరి బాబ్జి పలు సమస్యలను ప్రస్తావించారు.

కూటమి ప్రభుత్వంలో క్రైస్తవులు, దళితులపై దాడులు పెరిగాయి


కె.విన్‌స్టన్‌బాబు

పోడూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక క్రైస్తవులు, దళితులు, చర్చిలపై దాడులు పెచ్చుమీరిపోయాయనీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మరో మణిపూర్‌గా మార్చవద్దని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కె.విన్‌స్టన్‌బాబు హితవు పలికారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాజమండ్రిలో క్రైస్తవమత ప్రచారకుడు ప్రవీణ్ పగడాల మృతి చెంది ఉన్న ఘటనపై అనేక అనుమానాలున్నాయనీ, ఆయన శరీరంపై గాయాలుండడం వల్ల ప్రవీణ్ పగడాలను ఎవరో హత్యచేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో ఇటీవల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పులదండ వేయడం హేయమైన చర్యని విన్‌స్టన్‌బాబు తీవ్రంగా ఖండించారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై అనుమానాలు ఉండడంతో ఆయన మృతిపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ కేంద్ర హోంమంత్రికి, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలకు, మానవహక్కుల కమిషన్‌కు వినతిపత్రాలు అందజేస్తామని విన్‌స్టన్‌బాబు పేర్కొన్నారు.

ఇతరులకు సాయపడాలనేదే రంజాన్ సారం

నరసాపురం: ఇతరులకు సాయం చేయాలనే బృహత్తర లక్ష్యం పవిత్ర పంజాన్ పండుగ సారమని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కన్వీనర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ బులిమస్తాన్ అన్నారు. రంజాన్ మాసం పురస్కరించుకుని బుధవారం తన నివాసంలో 700 కుటుంబాలకు సొంత ఖర్చుతో బియ్యం, గోధుమలు, దుస్తులను పంపిణీ చేశారు. లవారికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనకున్న దాలిలో కొంతమేర ఇతరులకు పంచాలని ఖురాన్ ప్రభోధిస్తుందని అన్నారు. వైఎస్సార్‌సీపీ కేంద్రపాలకమండలి సభ్యుడు పీడీ రాజు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, ఎండీ మౌలాలీఖాన్, షేక్ అన్సారీ, ఎండీ షాన్‌వాజ్‌ఖాన్, వైఎస్సార్ సీపీ నేతలు బర్రి శంకరం, కామన బుజ్జి, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.


ముస్లిం కుటుంబాల వారికి నిత్యావసరాలు, దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రైతులు ఈ-పంట నమోదు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి

యలమంచిలి: వరి సాగు చేసి ఈ–పంట నమోదు చేసుకున్న రైతులందరూ సంబంధిత రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రైతు సేవా కేంద్ర ఇన్‌చార్జిని కలసి ఈ పంట నమోదు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి కోరారు. కాజ గ్రామంలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ పంట నమోదు ధ్రువీకరణ పత్రం బ్యాంకులలో రైతులు రుణాలు పొందడానికి, ప్రభుత్వ రాయితీలు పొందడానికి ఉపయోగపడుతుందన్నారు. కాబట్టి రైతులందరూ తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రం తీసుకుని భద్రపరచుకోవాలని ఆమె కోరారు. సార్వా మాదిరిగానే దాళ్వా ధాన్యం కూడా రైతు సేవా కేంద్రాల ద్వారానే మొత్తం ధాన్యం కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. రైతులు తమకు నచ్చిన రైస్ మిల్లుకే ధాన్యం తోలుకోవచ్చున్నారు. రైతులు ట్రక్ షీట్ జనరేట్ చేయించుకున్న సమయంలోనే ఎఫ్‌టీఓ (నగదు బదలీ ఉత్తర్వులు) కూడా జనరేట్ అవుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు చెల్లుబోయిన వెంకటేశ్వరరావు, తమ్మినీడి పుల్లారావు, గుంటూరు పెద్దిరాజు, గుబ్బల వెంకటేశ్వరరావు అగ్రికల్చర్ అసిస్టెంట్ ఈద జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.


రైతులకు ఈ పంట నమోదు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఏఓ చిందులూరి దేవి

నేడు యలమంచిలి ఎంపీపీ ఎన్నిక

యలమంచిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరగనున్న మండల పరిషత్ అధ్యక్షుడి ఎన్నిక నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత బుధవారం విలేకరులకు తెలిపారు. మండల ప్రత్యేక అధికారి ఎం శ్రీనివాసరావు (హౌసింగ్ ఈఈ) ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారని ఆమె తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య ఎన్నిక జరుగుతుందన్నారు. ఒక నామినేషన్ వస్తే ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటిస్తామని, ఒకటికి మించి నామినేషన్స్ దాఖలైతే సభ్యులు చేతుల ఎత్తే పద్ధతిలో ఎన్నిక నిర్వహిస్తామని ఆమె వివరించారు. ఎన్నికల నిర్వహణ సమయంలో మండల పరిషత్ కార్యాలయానికి 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. మండల పరిషత్ సభ్యులు, ప్రోటోకాల్ ఉన్నవారికి మాత్రమే లోపలకు అనుమతి ఉంటుందని ఆమె వివరించారు.


ఎన్నికల నిర్వహణ పత్రాలు చూస్తున్న అధికారులు

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

భీమవరం: మోటారు సైకిల్స్ ప్రమాదాల్లో ఎక్కువ శాతం తలకు గాయాల వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని, హెల్మెట్ ధరించడం వల్ల పూర్తి రక్షణ లభిస్తుందని భీమవరం ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పట్టణంలోని వీఎస్‌కే డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్మెట్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వాహనాలు నడిపేటపుడు లైసెన్స్, ఇన్సూరెన్స్, వెహికల్ డాక్యుమెంట్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు డ్రైవింగ్ చేసే వారేగాకుండా వారికి వెహికల్ ఇచ్చిన గార్డియన్ లేదా తండ్రి కూడా శిక్షార్హులవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ వైవీఎస్ఎస్ మూర్తి అధ్యక్షత వహించగా ట్రాఫిక్ ఎస్ఐ ఎం రామకృష్ణ, విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ భవాని, ట్రాఫిక్ ఏఎస్ఐ దాలయ్య పాల్గొన్నారు.


హెల్మెట్‌పై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

కాళ్ల: స్వచ్ఛంద సంస్థలు సామాన్యులకు కంటి వైద్య సదుపాయం కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాలు ఎంతో దోహదపడతాయని, వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ వైద్య సేవల జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ కీర్తి శ్రావణ్ అన్నారు. మండలంలోని బొండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం భీమవరం మానవత సంస్థ ఆధ్వర్యంలో, వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన శరీర అవయువాల్లో నేత్రాలు ప్రధానమైనవని, వాటి విషయంలో నిర్లక్ష్యం చేస్తే శాశ్వతంగా చూపుని కోల్పోతామన్నారు. ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసిన మానవత సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరంలో 160 మంది నేత్ర పరీక్షలు చేయించుకోగా , 78 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించారు. ఆపరేషన్లు 20 మందికి చేయిస్తున్నామని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పెన్మెత్స రామ్మోహనవర్మ (పూనా రాము), బుద్ధరాజు వెంకటపతిరాజు, కార్మూరి నరసింహమూర్తి (బాబు), గ్రంధి కుమార వెంకటేశ్వర ప్రసాద్, ఇందుకూరి ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరిపువ్వుతో జీవనోపాధి

యలమంచిలి: కూటి కోసం కోటి విద్యలు అని నానుడి. సమాజంలో రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబాలు అనేకం ఉన్నాయి. బతుకు తెరవు కోసం నిత్యం కూలీ పనులకు వెళ్లే కూలీలకు వ్యవసాయ పనులు లేని రోజుల్లో ఉపాధి కష్టమే. అలాంటి సమయంలో ఏదొక పని చేసుకునే జీవనం సాగించే వారు కొందరుంటే.. మరి కొందరు సీజనల్‌గా దొరికే పండ్లు, కాయలు అమ్ముతూ జీవనం సాగిస్తుంటారు. ఆ విధంగా జాతీయ రహదారులు, ప్రధాన కూడళ్లు, రద్దీగా ఉండే ఆలయాలు వద్ద ఇలాంటి చిరు వ్యాపారులను నిత్యం చూస్తూ ఉంటాము. ఎండలు మండుతున్న ప్రజలకు చల్లదనం ఇవ్వడానికి వీరు శ్రమిస్తుంటారు. ఇంత కష్టపడినా రోజు కూలీ దక్కితే అదే పదివేలు అనేట్లు ఉంటుంది వీరి వ్యాపారం.

పెద్ద గోపురం వద్ద కొబ్బరిపువ్వు..

పాలకొల్లు శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి (పెద్ద గోపురం) వద్దకు నిత్యం భక్తులు వస్తుంటారు. ఆ ప్రదేశం అనేక చిరు వ్యాపారులకు ఉపాధి కల్పిస్తుంది. అందులో ఒకటి కొబ్బరి పువ్వు వ్యాపారం. యలమంచిలి మండలంలోని అడవిపాలెం గ్రామానికి చెందిన దేశినీడి మాణిక్యాలరావు పెద్ద గోపురం వద్ద కొబ్బరిపువ్వు అమ్ముతుంటారు. అతనిని పలకరిస్తే ఈ వ్యాపారంలో ఉండే కష్టాన్ని వివరించాడు.

మొలకెత్తిన కాయలు నుంచే పువ్వు..

కొబ్బరి పువ్వు రుచికి బాగుంటుంది. పశ్చిమ డెల్టా, కోనసీమ వాసులకు కొబ్బరి పువ్వు సుపరిచితం. ఇతర ప్రాంతాల వారికి మాత్రం ప్రత్యేకంగా ఉంటుంది. కొబ్బరి పువ్వు కావాలంటే మొలకెత్తిన కొబ్బరికాయ నుంచి మాత్రమే వస్తుంది. కొందరు పెద్ద రైతులు, వ్యాపారులు కొబ్బరికాయను రాశులుగా పోస్తుంటారు. ఆ రాశుల్లో కింద కాయలు మొలకెత్తుతుంటాయి. కొబ్బరి మొక్కలు అమ్మే వ్యాపారులు, రైతులు కూడా రాశుల్లో ఏరివేసిన మొలకెత్తిన కొబ్బరికాయలను అమ్మేస్తుంటారు. వారి వద్ద నుంచి కాయలను తెచ్చుకుని కొబ్బరిపువ్వు తీస్తాం.

కష్టమెక్కువ..లాభం తక్కువ

రైతులు, వ్యాపారులు వద్ద మొలకెత్తిన కొబ్బరికాయను సైజును బట్టి రూ.10 నుంచి రూ.13లకు కొంటారు. తరువాత కాయ వలచి, కొట్టి పువ్వు తీయాలి. పువ్వు తీసిన తరువాత కొబ్బరి చెక్కను ఇంకా కొంత కొబ్బరి ఉంటుంది. ఆ చెక్కలను ఎండబెట్టి, ముక్కలు తీసి కొబ్బరి నూనె తీయవచ్చు. ఇంత కష్టపడితే మార్కెట్‌లో కొబ్బరి పువ్వు సైజును బట్టి రూ.15 నుంచి రూ.20కి అమ్ముతారు. కొబ్బరి పువ్వు నిల్వ ఉండదు. కాయ నుంచి వేరు చేసిన 12 గంటల్లో అమ్మేయాలి. లేకపోతే వాసన వస్తుంది. అందుకనే ప్రతి రోజు తెల్లవారుజామునే 5 గంటలకు నిద్రలేచి కుటుంబంలో అందరూ కష్టపడి పని చేసి కొబ్బరి పువ్వు తీస్తారు. ఏడున్నర గంటలకు మార్కెట్‌కు వస్తారు. 12 లేదా ఒంటి గంట సమయానికి అమ్మేయాలి. లేనిచో ఎండ వలన పువ్వు వాసన వస్తుంది. ఆ సమయానికి అమ్ముడు అవ్వకపోతే ధర తగ్గించి అయినా సొమ్ములు చేసుకోవాల్సి వస్తుందని మాణిక్యాలరావు చెప్పారు.


విక్రయానికి సిద్ధం చేసిన కొబ్బరి పువ్వు


కొబ్బరిపువ్వు వలిచిన తరువాత చెక్కలను ఉన్న కొబ్బరిని నూనె కోసం ఎండబెట్టిన దృశ్యం

మోపెడ్ పై పెట్టుకుని వ్యాపారం



గతంలో సైకిల్ పై కొబ్బరిపువ్వు పెట్టుకుని ఊరూరు తిరిగి అమ్మేవాళ్లం. ఇప్పుడు మోపెడ్ పై తెచ్చుకుని పెద్ద గోపురం వద్ద అమ్ముతున్నాను. వేసవి ఎండ ప్రతాపం చూపుతున్న లెక్కచేయకుండా ఈ వ్యాపారం చేస్తాం. ఎంత కష్టపడినా రోజు కూలీ డబ్బులు గిట్టుబాటు అయితే చాలు అన్నట్టుగా ఉంటుంది మా వ్యాపారం.

– దేశినీడి మాణిక్యాలరావు, విక్రయదారుడు

రైతులకు అదనపు ఆదాయం



కొబ్బరి పువ్వులో అనేక పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా సోడియం, పొటాషియం, కాల్షియం, ఖనిజాలు, విటమిన్– ఈ, ర్ ఉంటుంది. ఇవి తినడం వలన రోగ నిరోధ శక్తి పెరుగుతుంది. బరువు తగ్గడం, గర్భిణులకు నడుము నొప్పి నయం కావడం, కిడ్నీ ఇన్‌ఫెక్షన్, గుండె జబ్బులు, థైరాయిడ్ వంటి సమస్యలు తగ్గుతాయి. చర్మం ముడతలు రాకుండా నివారిస్తుంది.

– డాక్టర్ ఆర్.బిందు ప్రవీణ, ఉద్యాన శాస్త్రవేత్త, కేవీకే ఉండి

వైభవంగా తులసీదళార్చన, శాంతి కల్యాణోత్సవాలు


త్రిమూర్తులకు శాంతి కల్యాణాలు నిర్వహిస్తున్న అర్చకులు


మార్టేరులో త్రిమూర్తులను దర్శించుకుంటున్న భక్తులు

పెనుమంట్ర: మండలంఓలని మార్టేరు గ్రామంలో ఓకే ఆలయ ప్రాంగణంలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామికి, శ్రీ సీతారామచంద్రస్వామి, శ్రీ రమా సత్యనారాయణ స్వామివార్లకు బుధవారం ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుగంధ ద్రవ్యాభిషేకాలు, శాంతి హోమ పూజలు, మధ్యాహ్నం లక్ష తులసీదళార్చనలు, సాయంత్రం శాంతి కల్యాణ ఉత్సవాలు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసుల వెంకటాచార్యుల ఆధ్వర్యంలో పలువురు దంపతుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్టేరు, నెగ్గిపూడి, వెలగలేరు, వనంపల్లి, సత్యవరం గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు స్వామివార్లు దర్శించుకున్న అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయా కార్యక్రమాల్లో అల్లం భాస్కర్ రెడ్డి, వెంకటరెడ్డి, వెలగల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం చేశాడంటూ ఫిర్యాదు

భీమవరం: ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనను శారీరకంగా అనుభవించి మోసం చేశాడని ఒక యువతి ఫిర్యాదు చేసిందని వన్‌టౌన్ సీఐ ఎం. నాగరాజు తెలిపారు. భీమవరం పట్టణానికి చెందిన జి. ఉదయ్ బాధితురాలిని కొన్నేళ్లుగా ప్రేమిస్తున్నానంటూ వెంటపడి, తన ఇంజినీరింగ్ చదువు పూర్తి చేశాక ఉద్యోగం వచ్చిన వెంటనే పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించినట్లు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. అతడిని బుధవారం అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరు పరచగా రిమాండ్ విధించారన్నారు.

ఉపాధి పనుల్లో పంట కాలువలను బాగు చేయాలి

పెనుగొండ: అత్యవసర పరిస్థితుల్లో పంటకాలువలను మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో బాగు చేయాలని నీటిసంఘాల అధ్యక్షులు కోరారు. బుధవారం పెనుగొండ మండలప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద) అధ్యక్షతన నిర్వహించారు. పంటకాలువల్లో కర్ర నాచు పెరిగిపోవడంతో సాగు నీరు అందడం కష్ట సాధ్యంగా మారిందన్నారు. నీటి సంఘాల ఆధ్వర్యంలో కాలువల పనులు జరుగుతున్నా, అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఏకరువు పెట్టారు. ఇప్పటికే వంతుల వారీ విధానంలో నీటిని అందిస్తున్నామని తెలిపారు. ఒక్కరోజులో వరి చేలల్లోకి చేరాల్సిన నీరు రోజులు తరబడి వేచి చూసినా చేరడం లేదన్నారు. దీనికి కారణం కర్రనాచు పెరిగిపోవడమేనన్నారు. కొన్ని ప్రాంతాల్లో వేచి చూడకుండా అత్యవసర పరిస్థితుల్లో పంటబోదేలు, కాలువల పనులు చేపట్టాల్సి వస్తుందన్నారు. దీనికి జాతీయ ఉపాధి హామీ పథకంలో ఉపాధి కూలీల ద్వారా చేయిస్తే రైతులకు ఉపకారంగా ఉంటుందన్నారు. ఇటు ఉపాధి కూలీలు, అటు రైతులకు సాగునీటి ఇబ్బందులు తగ్గుతాయన్నారు. ఉన్నతాధికారులు సహకరించాలని కోరారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కరించాలి

దొంగరావిపాలెం, వడలి గ్రామాల్లో లో ఓల్టేజీ సమస్య పరిష్కరించాలని ఎంపీటీసీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. లో ఓల్టేజీతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో పర్యాయాలు లోఓల్టేజీ సమస్య అధికారుల దృష్టికి తీసుకు వచ్చినా ఫలితం లేదన్నారు. ఇప్పటికే అంచనాలు తయారు చేసి ట్రాన్స్‌ఫారమ్‌ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని విద్యుత్ శాఖాధికారులు తెలిపారు.

వైద్య సిబ్బంది గైర్హాజరుపై విమర్శలు

సిద్ధాంతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి వైద్యాధికారులు మండల పరిషత్ సమావేశాలకు హాజరు కాకపోవడం ఎంపీటీసీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సమావేశాలకు రాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అనంతరం ఆలస్యంగా వచ్చిన పెనుగొండ సీహెచ్‌సీ వైద్యులు సభ్యుల ప్రశ్నలకు సమాధానం చెప్పారు. ఉపాధి పనుల వద్ద ప్రథమ చికిత్స కిట్‌ల ఏర్పాటుతో పాటు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతామన్నారు. వివరాలు అందించాలని ఎన్‌ఆర్‌జీఈఎస్ అధికారులకు సూచించారు.

నీటి ఎద్దడి రాకుండా పర్యవేక్షణ

సాగు నీటి ఎద్దడి రాకుండా ఎప్పటికపుడు పర్యవేక్షణ చేస్తున్నామని ఇరిగేషన్ శాఖాధికారులు తెలిపారు. వంతుల వారీ విధానం కొనసాగిస్తున్నామన్నారు. మరో 10 రోజుల వరకూ నీటిని అందిస్తే పంట చేతికి వస్తుందన్నారు. నీటి వృథా కాకుండా రైతులు అందరూ సహకరించాలని కోరారు.

భూసారం పెంచడానికి సహకరించాలి

నేల భూసారం పెంచుకోవడానికి రైతులు కృషి చేయాలని వ్యవసాయాధికారులు విజ్ఞప్తి చేశారు. రెండు పంటలు అనంతరం వరి చేలను భీడు భూములుగా వదలి వేస్తున్నారన్నారు. అంతేకాకుండా, మోతాదుకు మించి రసాయనిక ఎరువుల వాడకం వలన రోజురోజుకూ భూసారం తగ్గిపోతుందన్నారు. దీని నివారణ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సిరిధాన్యాల సాగుపై ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. నవధాన్య జాతులు, పచ్చరొట్టేల జాతులను సాగు చేయాలన్నారు. దీనికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు పాలపర్తి సుబ్రహ్మణ్యం, తోలేటి శ్రీను, తహసీల్దారు జి.అనిత కుమారి, ఎంపీడీవో టి సూర్యనారాయణ మూర్తి, నీటి సంఘం చైర్మన్‌లు జక్కంశెట్టి సత్యనారాయణ, బొబ్బిలి శ్రీను తదిరులు పాల్గొన్నారు.

రమేష్ నిబద్ధత అభినందనీయం

మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ రమేష్ నిబద్ధతను ప్రతీ ఒక్కరూ ఆచరించాలని ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద) అన్నారు. పదవీ విరమణ చేయబోతున్న మండల పరిషత్ కార్యాలయ ఏఓ రమేష్‌ను బుధవారం పాలకవర్గం , అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించాయు.



పెనుగొండ మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం